క్లుప్తంగా

శరవేగంగా సీసీ కాలువల నిర్మాణం


బొడ్డవలసలో కాలువల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని బొడ్డవలస గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి మంజూరైన రూ.13 లక్షల వ్యయంతో ఈ పనులు చేయిస్తున్నామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సంధ్యారాణి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బి.శైలజ, పీఆర్ జేఈ రియాజ్ తదితరులు ఈ పనులను సోమవారం పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వారా ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో–2 బి.ఎరకయ్య వెల్లడించారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 14 ఏళ్ల వయసు నిండి, చదవడం, రాయడం వచ్చిన వారు పదో తరగతికి, 15 ఏళ్ల వయసు దాటి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌కి అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులేనన్నారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో ఎంపీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, పాఠశాల రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. అలాగే విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి రుచి, శుచికరమైన భోజనాలు విద్యార్థులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెంటాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా కోరాడ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనను ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, జేసీఎస్ కన్వీనర్ కె.త్రినాధులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. సిబ్బంది సహకారంతో మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మీసాలపేట సర్పంచ్ రామునాయుడు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఏఎస్ఐ భాస్కరరావు

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలి జంక్షన్‌లో పోలీసులు సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్ఐ గొడు భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహనదారుల లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనాలతో రోడ్ల పైకి వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లిపాలతోనే ..
బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


తెర్లాం: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న బాడంగి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి


తెర్లాంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు


రామభద్రపురంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 వద్ద ర్యాలీలో సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు


బొబ్బిలి రూరల్: అలజంగిలో గర్భిణులకు సీమంతం చేసిన దృశ్యం


రేగిడి: లచ్చారాయపురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ


వంగర: చంద్రంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


బొబ్బిలిలోని గొల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి


రాజాం: మెంతిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


సంతకవిటి: పనసపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల ఆవశ్యతను తెలియజేస్తూ అవగాహన సదస్సులు, ర్యాలీలు సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలంతా కార్యక్రమంలో పాల్గొని, తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, అప్పుడే పుట్టిన శిశువుకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాలు తాగిన శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. బిడ్డకు పాలివ్వడాన్ని బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి, ఆరోగ్య సూచనలు చేశారు.

–బొబ్బిలి, రాజాం

ముమ్మరంగా పారిశుధ్య పనులు


జేసీబీ సాయంతో కాలువలోని పూడికలు తొలగిస్తున్న దృశ్యం


అంతకాపల్లిలో కాలువలోని పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస పంచాయతీ, ఎం.ఆర్.అగ్రహారం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామంలోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి, డీపీవోలు గ్రామాన్ని ఇటీవల సందర్శించి, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించడంతో వీధి రోడ్లలోని చెత్తాచెదారం తొలగించడంతో పాటు, కాలువల్లోని పూడికలు, చెత్తను తొలగిస్తున్నారు. అలాగే రోడ్లుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లుతున్నారు.

రాజాం: మండలంలోని అంతకాపల్లి, మొగిలివలస గ్రామాల్లో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు సోమవారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ చిన్నంనాయుడు తెలిపారు.

వరుస పద్ధతిలో వరినాట్లు వేసుకోవాలి


రేగిడి: వరుస పద్ధతిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం


బొబ్బిలి రూరల్: వరినాట్లు వేయడంలో నిమగ్నమైన మహిళా కూలీలు

రేగిడి: వరుస పద్ధతిలో వరినాట్లు వేసుకోవాలని, తద్వారా పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి చేను ఏపుగా పెరుగుతుందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావు పొలంలో వరినాట్లు వేయడాన్ని సోమవారం పరిశీలించిన ఆయన.. పలు సూచనలు చేశారు. వరినారును తొలుత శుద్ధి చేసుకుని, ఆ తర్వాత వరిదుబ్బుకు.. వరిదుబ్బుకు మధ్య తగిన ఖాళీ ఉండేలా వరుస పద్ధతి అనుసరిస్తూ నారు చివర్లు తొలగించి, నాట్లు వేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ పి. తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాధపురం గ్రామంలో వరినాట్లు వేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. నారు చివర్లు తొలగించుకుని, నాటుకుంటే పంటకు చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. నాట్లు వేయడానికి ముందు నారును శుద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఉరిటి శంకరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


రాజాం: పరామర్శ అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


సంతకవిటి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, జగన్‌మోహన్‌రావు

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామ సర్పంచ్ కొరగంజి సాయిరాం తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) ఆ గ్రామానికి సోమవారం వెళ్లి పరామర్శించారు. అనంతరం డి.గదబవలస గ్రామంలో జావాన రామినాయుడు ఇటీవల మృతి చెందగా, ఆ బాధిత కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ జె.రమేష్‌నాయుడును, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా, బొబ్బిలి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తాను కోరినట్లు ఎమ్మెల్యే మీడియాకి తెలిపారు. బొబ్బిలి–తెర్లాం ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు, నియోజకవర్గంలోని మరికొన్ని రోడ్లకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 కోట్లు ఇవ్వాలని అడిగామని, నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు కూడా అందజేశామన్నారు.

రాజాం: డయేరియా బారినపడి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జి.సిగడాం మండలం, మెట్టవలస గ్రామానికి చెందిన పలువురు రోగులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు తదితరులు ఉన్నారు.

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేట గ్రామ సర్పంచ్ రూపిటి రమణమ్మ అత్తయ్య రూపిటి సీతమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావులు సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గోవిందపురం సర్పంచ్ రాగోలు రమేష్‌నాయుడు, రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, డాక్టర్ బి.నరేంద్ర, రూపిటి జనార్దనరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పలువురు పట్టణవాసులు, గ్రామస్తులు తమ పరిధిలోని పలు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అర్జీలు సమర్పించారు. కాలువలు బాగుచేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని, విద్యుత్‌స్తంభాలు, ఆటస్థలం ఏర్పాటు చేయాలని ఆయా వినతుల్లో కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అర్జీలు పంపించామని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ శివప్రసాద్ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండండి

సంతకవిటి: గ్రామ వ్యవసాయ సహాయకులంతా రైతులకు అందుబాటులో ఉండాలని ఏవో పైల నవీన్ సూచించారు. మండలంలోని మందరాడ రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సోమవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. వరి ఉబాలు జరుగుతున్నందున పొలాలకు వెళ్లి, వరినాట్లు వేయడంలో పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేయాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు.

దీపారాధన


దీపారాధన చేస్తున్న మహిళలు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మల్లిఖార్జున కాలనీలో ఉన్న కల్యాణగౌరీ మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో చౌడేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని, దీపారాధన సోమవారం నిర్వహించారు. కల్యాణగౌరీ మల్లిఖార్జున దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు 1008 దీపాలు వెలిగించి, ఆరాధించారు. అంతకుముందు మహిళలతో కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరవిల్లి హరినాధశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రామారావు

బాడంగి: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి, ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు సిద్ధం కావాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావులు పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు స్థానిక ఎంపీపీ చాంబర్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇదివరకు ఉన్న పేరెంట్స్ కమిటీలకు బదులు ఎస్‌ఎంసీలను కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ఎన్నికలు జరుగుతాయని, అనంతరం పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను అప్రమత్తం చేసి, ఎన్నికల్లో పాల్గొనేలా చూడాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పార్టీలకు అతీతంగా పారదర్శకంగా ఎన్నిక నిర్వహించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు నేత్ర పరీక్షలు


దివ్యాంగ విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

రాజాం సిటీ: స్థానిక సారధి రోడ్డులోని దివ్యాంగుల(చెవిటి, మూగ, మానసిక వికలాంగులు) పాఠశాలలో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు(దివ్యాంగులు)కు ఆప్తాలమిక్ అధికారి, ప్రభావతి జాగృతి సంస్థ వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు సోమవారం నేత్రపరీక్షలు నిర్వహించారు. అనంతరం శస్త్ర చికిత్స అవసరమైన వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. దివ్యాంగుల పట్ల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, ఇరుగుపొరుగు వారు, పరిసర ప్రాంతాల ప్రజలు సానుభూతి, దయ కలిగి ఉండి, ప్రత్యేక శ్రద్ధ వహిస్తే వారి మానసిక ఎదుగుదలలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్

బాడంగి: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రజలకు సకాలంలో సేవలందించి వారి మన్ననలు పొందాలని తహసీల్దార్ కె.సుధాకర్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో సోమవారం సమావేశమైన ఆయన.. మ్యుటేషన్లు, ధ్రువీకరణపత్రాల అందజేత అంశాల్లో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు వినతులు వచ్చాయన్నారు. కౌలురైతులకు సంబంధించి గుర్తింపుకార్డుల జారీలో జాప్యం చేయవద్దన్నారు. ఓటరు జాబితా, ఇళ్లస్థలాల కేటాయింపుల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీన పాఠశాలలకు ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు జరగనున్నందున పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 27వ తేదీలోగా దగ్గరలోని ఐటీఐ కళాశాలలో ఒరిజినల్ పదో తరగతి, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9000096048, 8309438446, 9959502238, 9052085679ను సంప్రదించాలన్నారు.

కేజీబీవీలో ఆకస్మిక తనిఖీలు


కుమ్మరిపేట కేజీబీవీ స్టోర్‌రూమ్‌లో బియ్యం, ఇతర సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో ఎంఈవో జె.త్రినాధరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత విద్యార్థినుల, సీఆర్‌టీల హాజరు, ఆ తర్వాత విద్యార్థినుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్‌లోని నిల్వ బియ్యం, పాలు, ఇతర సరుకులు, వాటి నాణ్యత, కాలపరిమితిని తనిఖీ చేశారు. అక్కడి నుంచి తరగతులకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలు అంచనావేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనకబడిన విద్యార్థినుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. విద్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వం విద్యార్థినులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు వారికి సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతిలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆమె.. ఏ గ్రామంలోనూ తాగునీటి ఇక్కట్లు ఉండకూడదని, ఎక్కెడెక్కడ కొత్త పైపులైన్లు వేయాలో.. పైపులైన్ల మరమ్మతులు చేయాలో, ఎన్ని ట్యాపులు అవసరమో నివేదికలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, కలుషిత నీటిని తాగడం ద్వారా డయేరియా బారినపడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి బోర్లు, నేలబావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునఃసమీక్షించాలి


అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టిన మాలల ఐక్యవేదిక సభ్యులు

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రాజాం నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం మానవహారం చేపట్టారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి, ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన మాల ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.